# మరో సీతకథ

—రావిపాటి

రాత్రి పదకొండు గంటలయింది. గడియారం గట్టిగా గంటలు కొట్టింది. నిద్రపట్టక బెడ్డుమీద అటూ యిటూ దొర్లుతున్న నేను వులిక్కిపడ్డాను. అప్పుడే పదకొండయిందా? అయినా ఆయన రాలేదు?

ఆయనెందుకు వస్తారు? అరుంధతితో పేకాడుతుంటే అర్ధరాత్రయితేగాని సాయంకాలం అయిదు గంటలయినట్లుంటుంది శ్రీవారికి.

సావిత్రితో సరసాలు పెట్టుకున్నారంటే రాత్రి చిన్నదయి చాలకుండా పోతుంది పాపం!

అనసూయతో షికార్లు కొడుతుంటే పగలూ రాత్రీ కలిసి గూడా పట్టుమని పదినిమిషాలయినా కానట్లుంటుందాయె మరి!

అహల్య ప్రక్కనగాని చేరారో అంతే సంగతులు!

నిట్టూర్చాను. లేచి బెడ్డుకు కుడివైపుగా వున్న డ్రస్సింగ్ మిర్రరు ముందు నిలబడ్డాను. నాకే ముద్దొచ్చేటంత అందం నాది. కాలిగోటినుండి తలదాకా ప్రతి అంగం అందంగా అమర్చాడు భగవంతుడు. నా క్లాసుమేటు శాంత ఎన్నిసార్లు నన్ను కౌగిలించుకునేది! ఎన్నిసార్లు బుగ్గలు కొరికేయలేదు! చాలామంది 'లిస్బన్స్' అనేవారు.

"ఏడిశారు వెధవలు. పొగరుబోతు ఆకతాయిలు. వాళ్ళ మాటలకేంగాని సీతా? నేనే అబ్బాయినయితే నీ ముక్కుకి తాడేసి వున్నపళాన లాక్కుపోయేదాన్ని" అనేది.

నా కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. నేడు మేరేజీ యానివర్సరీ గూడా. అయినా ఆ మనిషికి బొత్తిగా జ్ఞానంలేదు. పెందరాడే యింటికి రావాలన్న ధ్యాసేలేదు. నేను ఆరుగంటలకల్లా తయారయ్యాను. చక్కగా తలారస్నానం చేసి, వదులుగా జడ వేసుకుని విరజాజులు తల్లో తురుముకున్నాను. ఆయన కిష్టమయిన లేతాకుపచ్చ పెరివాయిలు చీర కట్టుకున్నాను. చెవులకు రూకాలు పెట్టుకుని, మెళ్ళలో నాన్నగారిచ్చిన మూడుపేటల ముత్యాల గొలుసు మెళ్ళో వేసుకున్నాను.

నా ప్రతిబింబాన్ని మరోసారి అద్దంలో చూసుకున్నాను. ఎక్కువసేపు నిలబడలేక అలాగే కూలబడ్డాను ప్రక్కనే వున్న సోఫాలో.


నాకేం కొదవ? అన్నీ వున్నాయి. ఆధునికంగా బ్రతకడాని క్కావలసినవన్నీ అమరివున్నాయి నా ఇంట్లో. అందగాడైన భర్త వున్నాడు. కాని, ఏం లాభం?

ఎన్నాడైతే నను మర ఎక్కువట అవుతానో ఆనాడే ఆలస్యంగా వస్తారు ఆయన. ఏదో మీటింగనో, కాన్ఫరెన్సనో, పార్టీ అనో, డిపార్టుమెంటల్ డిబేటనో చెబుతారు. నేను పిచ్చిదాన్ని. నిజంగా పిచ్చిదాన్ని. ఆయన చెప్పిందల్లా నమ్ముతాను. ఒక పెద్ద ఫరమ్‌లో జనరల్ మేనేజరు ఆమాత్రం బిజీగా వుంటాడనుకోవడం ఆశ్చర్యం కలిగించదు నాకు.

ఎంత ఆలస్యంగా వచ్చినాసరే, నా ప్రక్కనే చేరతారు. ఆ మాటా ఈ మాటా చెప్పి మరపించి, మురిపెం తీర్చుకుంటారు. ఆ రాత్రి ఎంతో తీయగా ఉంటుంది. మర్నాడు మళ్ళీ మామూలే. యథాప్రకారం లేటు లేటే!

ఒక్కోసారి నామీద నాకే అసహ్యం వేస్తుంది. అటువంటి భర్తని ఎందుకు చేరనివ్వాలి నేను? అలాటి మొండితనం వచ్చినప్పుడు నేను వేరే రూములో పడుకుంటాను, నేను మొండికేసినప్పుడు ఆయన చిత్రంగా ప్రవర్తిస్తారు. పసిపిల్లనులా బుజ్జగిస్తారు. ఎనలేని ప్రేమను ఒలకబోస్తారు! చివరికి ఎలాగైతేనేం లొంగదీసుకుంటారు నన్ను! అలాటి రాత్రులు ఆయనచేసే చమత్కారాలు మరిపురానివిగా, మధురంగా వుంటాయి. మామూలు రాత్రికన్నా నేను అలిగిన రాత్రులే మరింత తీయగా, నిండుగా వుంటాయి.

అరుంధతి, సావిత్రి, అనసూయ, అహల్య వీళ్ళలో ఎవరినీ నేను చూడలేదు. అయినా అక్కడా అక్కడా విన్నాను అలాగని. మొదట్లో కిట్టనివాళ్ళు చేసే దుష్ప్రచారం అనుకున్నానుగాని, ఒక్కోసారి నమ్మాలనిపించేది. నిజంగానీ, అబద్ధంగానీ దేనిని నిరూపించడానికయినా నాకు సాక్ష్యమూ దొరకలేదు. నావద్ద ఆధారమూ లేదు. అందుకని కసిగా వున్నప్పుడు వాళ్ళున్నారని నమ్మి తనివి దీరా తిట్టుకుంటాను. హాయిగా ఉన్నప్పుడు వాళ్ళే పురాణాల్లోని పాత్రలలాగానో కల్పనల్లోని స్త్రీలలాగానో నుసకమసగ్గా కనిపిస్తారు! అంతే. వాళ్ళవల్ల తనకేమీ బాధ వున్నట్లు అనిపించదు మరి!



''ఆ పాముని విదేశాలనుంచి తెప్పించాట్ట!!''

అయినా మన బంగారం మంచిదయితే అలా అనుకునేసరికి పట్టలేని ఉక్రోషం ముంచుకొచ్చింది నాకు. ఈ రాత్రి ఎలాగైనాసరే నిగ్రహంగా ఉండాలి. నేను లొంగిపోగూడదు. ఆయన అషామాషీ పనులకి, అశ్రద్ధకీ తగిన శిక్ష విధించాలి, అప్పుడు ఎంచక్కా దారికి వస్తారు. ఎవరికోసం? మర్నాటినుండి సీతావిధేయులుగా మారిపోవాల్సిందే!

ఆ మాత్రం ఆలోచించాక కాస్త కుదుటబడింది నా మనసు.

"సీతా! సీతా!" పెనుతుఫానులా పరు

గ్గుత్తుకొచ్చారు మధు.

"..... ......"

"ఇదేమిటోయ్? ఈవేళ మన వెడ్డింగ్ డే కదూ?" కోటు తీసేసి నేరుగా వచ్చి బెడ్డుమీదే కూర్చున్నారు.

నేను దూరంగా జరిగి ప్రక్కకు తిరిగి పడుకున్నాను.

"ఓయ్! ఓయ్! నిన్ను చూస్తుంటే నిలువునా తినేయాలనిపిస్తుంది. ఇప్పుడే వస్తానుండు."

గబుక్కున ముద్దుపెట్టుకుని పరుగెత్తారు మధు.

సిగ్గులేకపోతే సరి! అర్థరాత్రి రావడమే కాకుండా మోటుసరసం గూడా!

నా నిర్ణయాన్ని మరోమారు గుర్తుచేసుకున్నాను. చీరకొంగుతో బుగ్గ తుడుచుకున్నాను.

మధు వచ్చారు. గ్లాస్కోపంచె, సిల్కులాల్చీ, మెడలో పులిగోరుల లాకెట్టూ, వుంగరాల జుట్టూ, కండలు తిరిగిన శరీరం, బలమైన ఛాతీ, కవ్వించే కళ్ళు, తళుక్కుమంటున్న తెల్లని పళ్ళు

చూపులు మరల్చుకున్నాను. అమ్మో! మరికొంచెంసేపు చూశానో, నా నిర్ణయం పటాపంచలవుతుంది. కాగూడదని గట్టిగా అనుకున్నాను.

ఎంత వారిస్తున్నా వినకుండా నన్ను రెండు చేతులతోనూ పైకెత్తి డైనింగు హాలుకు తీసుకెళ్లారు. పసిపిల్లను తినిపించినట్లు నాచేత భోజనంచేయించారు. అయినా నా పట్టుదల సడలలేదు.

గబగబా చేయి గడుక్కుని వచ్చి ప్రక్కకు తిరిగి పడుకున్నాను.

అయిదుపదినిమిషాల తరువాత వచ్చారు ఆయన. చొక్కా విప్పి స్టాండుకు తగిలించారు. అద్దంలో చూసుకుని నవ్వుకున్నారు.

నేను ఓరకంట గమనిస్తూనే ఉన్నాను. ఆయన లైటు తీసేశారు.

మెల్లగా వచ్చి నా ప్రక్కనే పడుకున్నారు. నా గుండె వేగంగా కొట్టుకోసాగింది. నా నిర్ణయం నన్ను హెచ్చరించింది. గట్టిగా ముడుచుకుని పడుకున్నాను.

"సీతా!" ఎంత మెత్తగా వుంది ఆయన గొంతు.

"... ."

"సీతా! డార్లింగ్!" ఎంత తీయగా వుందా కంఠం.

" . "

"సీతా! రా సీతా!" మత్తుగా ఆహ్వానిస్తుంది ఆ పిలుపు. నేను కదల్లేదు మెదల్లేదు.

ఆయన నా భుజంమీద చేయివేశారు. నా గుండె ఝల్లుమంది. మెల్లగా విడిపించుకున్నాను. నా గుండె దడ నాకే స్పష్టంగా వినిపిస్తుంది.

"సీతా! ఈ రోజు ఎంత మంచిరోజు! ఎంతో తీయగా వుండవలసిన రాత్రిని ఇలా పాడు చేసుకుంటారా ఎవరయినా?"

అబ్బ! ఎంత నటన? అంతా నాటకం! చేయవలసిందంతా చేస్తారు? చెడు తిరుగుళ్ళన్నీ తిరుగుతారు. అవసరం వస్తే మాత్రం కాళ్ళు పట్టుకుంటారు. అబ్బ! సిగ్గేలేదు మీ మగజాతికి అనుకున్నాను.

"రా సీతా! అంతగా పరీక్షించకు

నన్ను."

మెల్లగా వళ్ళంతా నిమరసాగారు.

నా శరీరం నాకే ఎదురు తిరగసాగింది మనసు తిరగబడసాగింది.

"రాత్రి పన్నెండు గంటలకు గుర్తు వచ్చిందా భార్య మీకు?" కోపంగా అన్నాను.

"ఏం చేయను సీతా! అమెరికానుండి వ్యాపారులు వచ్చారు మా ప్రొడక్ట్సు తీసుకుందుకు. అంతా అయి బయటపడేసరికి యింత లేటయింది. పని పూర్తవడంతోటే రెక్కలు కట్టుకుని నీముందు వాలాను."

మధు చేతులు నా వీపును వెతుక్కుంటున్నాయి,

నా నరనరంలో విద్యుత్తు వ్యాపించసాగింది. ఎదురుతిరిగే శరీరాన్ని స్వాధీనంలోకి తెచ్చుకోవడం కష్టమనిపించింది. లేవబోయాను.

నన్ను లేవనీయలేదు ఆయన.

"అమెరికా వ్యాపారి అంటే అనసూయా? అహల్యా?"

"ఛీ.... ఛీ . . నీకెప్పుడూ అనుమానాలే!"

నాకు తెలియకుండానే నన్ను తన వేపుకి త్రిప్పుకున్నారు. పులకింత లెక్కువై శరీరం విప్లవం చేస్తుంటే మనసు మరేం చెయ్యలేకపోయింది.


మధు చేతలు వింతగా వున్నాయి. గాడి తప్పుతున్నాను.

"సీతా! యీ రాత్రి తోడుగా చెబుతున్నాను. నాకు భార్యగానీ, ప్రేయసిగానీ, తోడుగానీ, నీడగానీ అంతా నువ్వే. నువ్వు మినహా నాకు ఎవరూ లేరు. సీతా! ఎవరూ వద్దు గూడా. అంతులేని యీ అందాలరాసి . ఈ బంగారుదేవత కరుణిస్తే అదే చాలు నాకు. నువ్వే నా లోకం..."

మధు మాటలు తియ్యగా వున్నాయి. బెడ్డు మెత్తగా వుంది. రాత్రి అందంగా వుంది.

చల్లగాలి ... మధు స్పర్శ . గిలిగింత . పులకింత . ఆవేశం .. ఉద్వేగం .. బాధ ... హాయి .

నా నిర్ణయం పటాపంచలయింది.



జైలలితా రెండ్రూపాయలు, జైసుధ రూపాయిన్నరా, జైచిత్ర రెండున్నర, జైప్రద రెండ్రూపాయలు, సుజాతా రెండ్రూపాయలు...''

''కాలెండర్లు అమ్ముతున్నాడు''